

# మంచి మనిషి

-పి.ఎస్.నారాయణ

**మా** బాబాయి కూతురు పెళ్ళయితే గుంటూరు వెళ్ళక తప్పలేదు. చాలా కాలమయింది. శ్రీమతి గూడా వద్దామనుకున్నది గాని పిల్లవాడికి పరీక్షలు జరుగుతుండటంతో నేను ఒక్కడినే బయల్దేరాను.

రాత్రి ఒంటిగంటకు లగ్నం. ముందే పెళ్ళికూతురుకి, పెళ్ళికొడుక్కి దండలు వేసి స్టేజీ ఎక్కించి కూర్చోపెట్టారు రెసెప్షనంటూ. ఇక లగ్న సమయంలో తెరసెల్లా శాస్త్రార్థం అడ్డంగా పెట్టి ఇద్దరినీ పీటల మీద కూర్చోపెడతారు. ఆపైన అక్షింతలు వేసేటందుకు అతి ముఖ్యులయిన బంధువులు, చాదస్తపు ముసలివాళ్ళు తప్పా ఎవరూ వుండరు.

హైద్రాబాద్ నుంచల్లా వెళ్ళేది ఒక్క భోజనం కోసరమే కాదుగదా. లగ్నం అయ్యేటంతవరకూ నేనూ మెళుకువతోనే కూర్చున్నాను నిద్ర ముంచుకు వస్తున్నా. అక్షింతలు వేశాను. పెళ్ళింట్లో నాకు నిద్ర కుదరదులే అని అక్కడకు దగ్గరలోనే తీసుకున్న లాడ్జికి వెళ్ళి దుప్పటి బిగిస్తే మరునాడు ఉదయం ఎనిమిది గంటలకు గాని మెళుకువ రాలేదు. ఆపైన స్నానం చేసి హైదరాబాద్ తిరుగు ప్రయాణానికి రాత్రి బస్సుకు టిక్కెట్టు కోసరం బయల్దేరాను.

సంవత్సరం ఆఖరవ్వటంతో సెలవులు చాలావరకు ఖర్చయినయి. అందుకే హడావుడి. నా ఆప్తమిత్రుడు వేణు ఆఫీసుకు ఫోను చేశాను. వాడిని చూచి చాలా రోజులయింది. వాడు నా రాకకు ఆనందాన్ని, ఆశ్చర్యాన్ని గూడా వ్యక్తం చేశాడు. "రాత్రే మా యింటికి రావాల్సింది. లాడ్జిలో దిగటమేమిటి... ఇప్పుడు ఆఫీసుకు వస్తావా, సాయంత్రం ఇంటికి వస్తావా?" అన్నాడు హడావుడి పడుతూ. "కాదంటావా... నన్ను సెలవుపెట్టి ఇప్పుడే వచ్చేయమంటే వచ్చేస్తాను!"

"అలా వద్దులే గాని... నువ్వు మామూలుగా సాయంత్రం ఆఫీసు అయింతరువాత ఇంటికి వెళ్ళి వుండు... నేను ఆరు లోపే మీ యింటికి వస్తాను... మళ్ళా పదిన్నర బస్సుకు వెళ్ళిపోవాలి!"

"సరే అయితే... డిన్నర్ మా యింట్లోనే... గుర్తుంచుకో!" అన్నాడు వేణు.

అన్నట్లుగానే అయిదింటికి బాబాయి గారింట్లో అందరినీ చెప్పేసి, నా భార్యను తీసుకురానందుకు మా పిన్ని చేతిలో మరోసారి అక్షింతలు వేయించుకొని... ఆ పైన రాని ఆవిడగారికంటూ ఇచ్చిన స్వీట్స్ ప్యాకెట్టును బ్యాగ్‌లో పడేసుకొని కృష్ణనగర్‌లో ఉన్న వేణు ఇంటికి వెళ్ళేటందుకు గాను రిక్షా ఎక్కాను.

రిక్షా ఎక్కటం గూడా ఒక సరదానే! హైదరాబాద్‌లో ఎట్లాగూ ఆ వాహనయోగం లేదు...

పై టాపు తీయించేసి కూర్చున్నాను. సిమెంటు రోడ్డుమీద దూసుకుపోతున్నది రిక్షా.

బ్రాడీపేట చివరి దాకా వచ్చాం. రోడ్డు సన్నమయింది. అటూ యిటూ పెంకుటిళ్ళు, గుడిసెల మీదుగా లేస్తున్న పొగలు... అక్కడక్కడా మధ్యలో డాబాలు, మేడలు...

ముందుకు చూస్తున్న నా చూపు అకస్మాత్తుగా ఓ డాబా యింటి గేటు ముందు ఆగిపోయింది.

అక్కడ ఓ స్త్రీ నిల్చొని ఎటో చూస్తున్నది ఎవరికోసరమో ఎదురు చూస్తున్నట్లుగా. ఆమెను చూస్తుంటే నా స్మృతిపథంలో శాంత మెదిలింది.

రిక్షా ఇంకాస్త ముందుకుపోగానే ఆమెను మరింత దగ్గరిగా చూచాను. అవును- ఆమె శాంతే! పెదిమ క్రిందగా కుడివేపున పుట్టుమచ్చ... ఆమెను చూచి చాలా రోజులయినా గుర్తుపట్టగలను... కాస్త లావెక్కిన మాట నిజమే కాని- అందంలో మార్పు లేదు!

ఆమెనే కన్నార్పకుండా చూస్తున్నాను... ఆమెను చూడటమే పెద్ద థ్రిల్లు నాకు!

ఆమె నన్ను చూస్తూనే ఉలిక్కిపడ్డట్లుగా కనురెప్పలు టపటపలాడిస్తూ, "రాంబాబు కదూ!" అన్నది. తరువాత తడబడుతున్నట్లుగా "రాంబాబేనా?"అంటూనే ఓ మెట్టు దిగింది ఆశ్చర్యంగా నా వంక చూస్తూ.

రిక్షా ఆపించి దిగాను. రిక్షా అతనికి డబ్బులిచ్చి పంపివేశాను.

చేతిలో సంచీతో నేను... గేటు దగ్గర నావంకే చూస్తున్న ఆమె... ఇద్దరం కొన్ని క్షణాలవరకూ కొయ్యబొమ్మల్లాగానే వుండిపోయాం.

"రా లోపలకు!" మరో థ్రిల్లు.

నన్ను చూచి ఆశ్చర్యపోతూ పేరు పెట్టి పిలవటమే ఒక ఎత్తు అయితే లోపలకు రమ్మనమంటూ ఆహ్వానించటం మరో ఎత్తు. కాలేజీలో చదువుతుండగా ఆమెను ఎంతగానో ప్రేమించిన నన్ను ఎంతగా అవమానపరిచిందీ నాకు గుర్తున్నది.

నన్ను రిక్షాలో చూచిన వెంటనే ఆమె 'రాంబాబూ'అని పిలవకుండా వున్నట్లయితే, ఆనాటి ఆమె ఆ అవమానపు మాటలు గుర్తుకువచ్చి నాకు ఎంత బాధ రగులుతున్నా రిక్షా దిగి వుండేవాడిని కాదు. గతాన్ని గుర్తుకు తెచ్చుకుంటూ కొన్ని గంటలు- మహా అయితే రేపు ఉదయం హైదరాబాద్‌లో ఇంట్లో కాలు పెట్టేటంత వరకూ ఆమె నామాన్నే మననం చేసుకుంటూ వుండివుండే వాడినే తప్పా.

శాంత మా కాలేజీ బ్యూటీ!

నేనూ అందహీనుణ్ణేం కాదు. ఆ కాలేజీలో వున్న అందమైన మొగవాళ్ళలో నేనూ ఒకడినే.

ఆమెకున్న అందానికి మించిన అహంతో నన్ను ఆమే దూరం చేసుకున్నది.

స్థితిమంతురాలిననే గర్వం... నేను తన హోదాకి తగననే ఈసడింపు...

అంత స్నేహంగా వుండే తనను అంత తీసేసినట్లుగా మాట్లాడటానికి ఆమె తల ఎగరేస్తూ చెప్పిన మాటలను నేను జన్మలో మరిచిపోలేను. 'స్నేహానికి కావాల్సింది సమానమ్మైన వయస్సు... వివాహానికి కావాల్సింది సమానమైన అంతస్థు... చనువిస్తున్నాను కదా అని ఒక దాంట్లో నుంచి మరో దాంట్లోకి దూకేస్తే చాలా అసహ్యంగా వుంటుంది! బి ఇన్ యువర్ లిమిట్స్!"

జీవితం ఎంత విచిత్రమయింది.

ఆమె వెనుదిరిగి మెట్లెక్కుతూ లోపలకు అడుగుపెట్టింది.

దేవుడిచ్చిన హుందాతనం కొందరికి ఎంతో ఇంపుగా వుంటుంది. కాలం కరిగిపోతున్నా ఆమె అందంలోగాని, ఆమె నడకలో కాని నాకంతగా మార్పు కనబడలేదు. శాంత ఎన్ని సంవత్సరాలయినా ఆ శాంతే!

"ఏ ఊళ్ళో ఉంటున్నావ్?" సోఫాలో కూర్చున్న తరువాత అడిగింది. "మంచినీళ్ళు కావాలా?"

"వద్దు... హైదరాబాద్‌లోనే వుంటున్నాను!"

"పెళ్ళయిందా?... పిల్లలా?"

"ఆహా... ఒక మొగ పిల్లవాడు... పాప! నీకెంత మంది పిల్లలు?"

"నేనే చిన్నపిల్లను... అప్పుడే ఏం పిల్లలు?" అన్నది తల ఎగరేస్తూ.

కాలేజీలో చదువుతున్నప్పుడు గూడా ఇలాగే ప్రతి మాటకూ తల ఎగరేస్తుండేది... అది చూచినప్పుడల్లా పొగ రు నరనరాన ఆవరించివున్నది అని అనుకుంటుండేవాడిని నేను... కానీ మరుక్షణాన వీనస్‌కు ఎంత పొగరు ఉంటేనేం వీనస్ కాకపోతుందా అనిపించేది... అదో మధుర స్మృతి...

"ఎక్కడికి వచ్చావ్?... ఎప్పుడు వచ్చావ్?"

"రాత్రి మా బాబాయి కూతురు పెళ్ళయితే వచ్చాను... ఇప్పుడు ఒక స్నేహితుడు డిన్నర్‌కు పిలిస్తే వాళ్ళింటికి వెళుతున్నాను... రాత్రి పదిన్నరకు తిరిగి హైదరాబాద్ బస్సెక్కేయటం గుంటూరులో ఆఖరి ప్రోగ్రాం!"

ఎవరో గేటు తీస్తున్న చప్పుడయితే త్వరత్వరగా ఆమె వెళ్ళింది. తిరిగి రెండు నిముషాలల్లోనే లోపలకు వచ్చి మేం కూర్చున్న గది తలుపుకు దగ్గరిగా కుర్చీ లాక్కొని కూర్చున్నది.

"ఎవరిల్లో కావాలీ అంటూ తలుపల్లా కొట్టి అడగాలా?" తల ఎగరేస్తూ చికాగ్గా అన్నది.

"మీ ఆయనేమో అనుకున్నాను!" ఆయన ఎంత అందగాడో, ఆపైన ఎంత గొప్పవాడో ఒక్కసారి చూద్దామని వున్నది అని గూడా అందామనుకున్నాను కానీ చాలాకాలం తరువాత కనబడి ఆప్యాయంగా ఆహ్వానించిన ఆమెను నా మాటలతో కించ పరచటం ఇష్టం లేదన్నట్లుగా మనస్సులోనే ఆ కోరికను త్రుంచి వేసుకున్నాను.

ఎందుకనో శాంత బాధపడేలా ఒక్క మాటా అనాలని అనిపించదు ఎన్నడూ. ఆమె అంటే అంత అభిమానం. ఆమె అందం అంటే అంత ఆరాధన...

దేవతలు ఎలా వుంటారో తెలియదు గాని, ఎవ్వరైనా దేవత ఎలా వుంటుందీ అని నన్ను అడిగితే, శాంతని చూపించి, 'ఇలా వుంటుంది'అని నేను ఖచ్చితంగా చెప్పగలను. దోసగింజ బొట్టు. వత్తయిన తల కట్టు. పిరుదుల దాకా నడుస్తుంటే నాట్యంచేసే జడ... ఐదున్నర అడుగుల పొడుగులో... వ్వాహ్... ఏంజల్...

ఆ ఆలోచనలలో నా పెదిమల మీదకు అప్రయత్నంగా వచ్చిన చిరునవ్వును గమనించి, "ఏవిటి నవ్వుతున్నావ్?" అన్నది.

"అది నవ్వుకాదు... నిన్ను చూచాననే ఆనందం!"

"సరే సరే... నీ ఆనందాన్ని అలాగే అనుభవిస్తుండు... మళ్ళా హైదరాబాద్ బస్సెక్కితే నీ హృదయరాణి నీకు మరే ఆలోచనలూ లేకుండ కట్టి పడేస్తుంది!"అన్నది కళ్ళు చికిలించి పకపకా నవ్వుతూ.

"అదేంమాట... నువ్వు ఎప్పుడూ గుర్తుకు వస్తూనే



"వద్దు శాంతా! కూర్చొని కబుర్లు చెబితే గుండెల్లో దాచుకుంటాను!"అన్నాను తన్మయంగా... ఆమె నోటినుండి వెలువడే ముత్యాల్లాంటి ప్రతి మాటనూ ఏరుకోవాలన్నట్లుగా.

వుంటావ్... వచ్చినప్పుడల్లా పిసరంత కోపంతోపాటు, ఆనందమూ కలుగుతునే వుంటుంది. నువ్వు నన్ను దూరం చేసుకున్నా నేను మాత్రం నిన్ను నా మనస్సునుండి ఎన్నడూ దూరం చేసుకోలేదు... చేసుకోలేను గూడా!"

"ఎప్పుడో కాలేజీలో చదివేటప్పుడు తెలిసీతెలియని ప్రేమలో పడ్డ అమ్మాయి కోసరం మూడు ముళ్ళావేసిన అమాయకురాలికి అన్యాయం చేసే ఏ మొగవాడూ సుఖపడలేదు... సమాజమూ సుఖ పడనీయదు... కాఫీ కలుపుకు వస్తాను త్రాగుదువు గాని!" అన్నది నవ్వి. "పిచ్చి పిచ్చి ఆలోచనలు మాని హాయిగా కూర్చో!"

"వద్దు శాంతా! కూర్చొని కబుర్లు చెబితే గుండెల్లో దాచుకుంటాను!"అన్నాను తన్మయంగా... ఆమె నోటినుండి వెలువడే ముత్యాల్లాంటి ప్రతి మాటనూ ఏరుకోవాలన్నట్లుగా.

నా మాట వినిపించుకోకుండానే ఆమె ఆ గదిలోనుంచి వెళ్ళిపోయింది.

నాకు అర్థమయింది- నేను వద్దన్నా వినేలా లేదు... కాఫీ తెస్తుంది... త్రాగక తప్పదు!

- ఆ తన్మయత్వంలోనే గూడలెగరేసి ఆమె ఎప్పుడు బయటకు వస్తుందా అన్నట్లుగా ఆమె వెళ్ళిన తలుపు వంకే చూస్తూ కూర్చున్నాను.

ఒక ప్లేట్లో బిస్కెట్లు, కప్పుతో కాఫీ తెచ్చి నా ఎదురుగ్గా టీపాయ్ మీద పెట్టింది.

"తప్పదా!"

"నీ యిష్టం... ఆత్మీయంగా ఇచ్చాను... తీసుకుంటే సంతోషిస్తాను!" అన్నది తల వంచుకొని చిన్నగా.

నేను ఇక మరి ఆలోచించలేదు. బిస్కెట్లు అందుకొని తింటూ, "నువ్వూ తీసుకో!" అన్నాను.

ఇద్దరం బిస్కెట్లు తింటూ ఒకరినొకరం చూచుకుంటూ కూర్చున్నాం.

"పైన దేవుడు వ్రాసి పెట్టనప్పుడు ఇలాగే జరుగుతుంటుంది శాంతా!... ఎంత ఆత్మీయత వున్నా మనస్సు ఎదురు తిరుగుతుంది. అవకాశాలు జారవిడుచుకునేలా చేస్తుంది... నేను నీతో నా జీవితాన్ని ముడి వేసుకొని భవిష్యత్తును ఎంతో అందంగా ఊహించుకున్నాను... కానీ కుదర లేదు... ఆ జీవితం అయిపోయింది... ఇది మరో జీవితం... రొటీన్... రొటీన్ లైఫ్... పెళ్ళాం, పిల్లలు... ఆఫీసు..." ఆగి ఆగి గుండెలోతుల్లోనుంచి అన్నాను.

"నేను దురదృష్టవంతురాలిని!"

ఆమె పశ్చాత్తాప పడటం నాకు మానసికంగా ఎంతో తృప్తిని కలిగించింది. నాకు విజయం లభించినట్లే భావించాను. శారీరకంగా ఆమె నాకు దగ్గర అవ్వకపోవచ్చు... మానసికంగా ఆమె వాడినే నేను అనే ఆత్మసంతృప్తి నన్ను ఆనందపరిచింది.

బయట ఆటో ఆగిన చప్పుడయింది.

లేచి త్వరత్వరగా వాకిట్లోకి వెళ్ళింది శాంతి. తరువాత రెండు నిముషాలల్లోనే లోపలకు వస్తూ, "ఆయనేమోననుకున్నాను...ఆయన కోసరం ఆయన స్నేహితులు వచ్చారు... మళ్ళా వస్తామని వెళ్ళారులే!"అంటూ నా ఎదురు కుర్చీలో కూర్చున్నది.

టైం చూస్తే ఏడు గంటలయింది. వేణు నేను రాలేదని హడావుడి పడుతుంటాడు. శాంత భర్త కోసరం ఎదురు చూస్తూ కూర్చునే సమయం నాకు లేదు.

నేను కాఫీ త్రాగి, సాసర్‌ను టీపాయ్ మీద పెట్టి, "నేను వెళతాను శాంతా! ఈరోజు నాకు చాలా ఆనందంగా వున్నది... జీవితంలో మళ్ళీ నిన్ను చూస్తానో లేదో అనుకున్నాను... ఇప్పుడు నిన్ను చూడటమే కాదు... నీ ఆతిథ్యం స్వీకరించాను గూడా... మైగాడ్... దేవుడు ఒక్కొక్కసారి ఎంత మంచి పనులు చేస్తుంటాడో! వస్తాను మరి!"

ఆమె లేచింది. మౌనంగా నా వెనుకగా గేటుదాకా వచ్చింది. "ఓకే! బై... మరోసారి ఎప్పుడో ఇలాగే అకస్మాత్తుగా కలుసుకొని గతాన్ని నెమరు వేసుకుందాం!"అంటూ చేతిలో సంచీతో నేను వడివడిగా అక్కడకు దగ్గరలోనే వున్న కృష్ణనగర్ వైపుకు అడుగులు వేయటం మొదలుపెట్టాను.

వీధి చివరకు వెళ్ళి వెనక్కు తల తిప్పితే శాంత ఇంకా గేటు దగ్గరే నిలబడి నావైపే చూస్తున్నది!

నా జన్మ ధన్యమయింది!

తరువాత పావుగంటకు నేను వేణు ఇంటిముందు వున్నాను.

"ఏరా! మీ బాబాయి నిన్ను వదల్లేదేమిటి... నేను నీ కోసరమని ఐదింటికే ఇంటికి వచ్చాను!" అంటూ నా చేతిలో సంచీ అందుకొని నన్ను లోపలకు ఆహ్వానించాడు వేణు.

"బాబాయి గారింట్లో అనుకున్నట్లుగా అయిదింటికే బయల్దేరాను గాని... దారిలో అనుకోకుండా ఒక థ్రిల్లు!"అంటూ కుర్చీలో కూర్చొని మంచి నీళ్ళ గ్లాసు అందిస్తున్న వేణు భార్యను, "ఏమమ్మా! కులాసానా... వాడు ఎట్లాగూ తొందరగా కదలడు... నువ్వన్నా ఆ పీఠాన్ని కదిలించి ఒకసారి హైదరాబాద్‌కు తీసుకురాగూడదూ!"అన్నాను.

(మిగతా 19వ పేజీలో)

# సైన్స్ టిప్


-సి.వి.సర్వేశ్వర శర్మ

నేరాలు చేసినవారు తమ నేరాన్ని అంగీకరించరు. తమకు ఏమీ తెలియదని బుకాయిస్తూ ఉంటారు. ఇలాంటి వారినుండి నిజం రాబట్టేందుకు చాలా క్రూరమైన పద్ధతులు అవలంబిస్తూ ఉంటారు. ఒకొక్కప్పుడు అమాయకులు ఈ పద్ధతులకు అనవసరంగా బలైపోతూ ఉంటారు.

మనిషి నిజం చెబుతున్నది అబద్ధం చెబుతున్నది పసిగట్టే పరికరాన్ని 'పాలిగ్రాఫ్' అంటారు. దీనికి సైకో ఇంటెగ్రో ఆమ్మీటర్ అని కూడా పేరు. శరీర భాగాలు నిర్వహించే పనితీరుల్లో తేడాలను ఈ పరికరం గుర్తిస్తుంది.

ఆవేశపు ఒత్తిడికి లోనయి మనిషి అబద్ధం చెబుతూ ఉంటే శరీర భాగాలు నిర్వహించే పనుల్లో తేడా వస్తుంది. ఇందులో గమనించవలసిన అంశం మనిషి చర్మంయొక్క నిరోధకత్వం.

## మనిషి అబద్ధం చెబితే లై డిటెక్టర్ ఎలా పట్టుకోగలదు?




శరీర చర్మం నిరోధకత్వంలోని మార్పులను పాలిగ్రాఫ్ పట్టుకుంటుంది. మనిషి ఆవేశితమైన ఒత్తిడికి లోనయితే చెమట పడుతుంది. ఆటోమేటిక్‌గా నరాల వ్యవస్థ ఆవేశిత ప్రేరణలకు వెనువెంటనే స్పందిస్తుంది. ఈ స్పందనకు జవాబుగా గ్రంధులనుండి చెమట పుడుతుంది.

శరీరంపై చెమట పట్టడం అనే విషయం ఆ మనిషి మానసిక స్థితిని తెలియజేస్తుంది. చెమట పట్టే శరీర భాగాలు, తక్కువ లేదా అసలు చెమట పట్టని ప్రాంతాల్లో శరీర చర్మం నిరోధకత్వాన్ని అధ్యయనం చేస్తారు. అరచేయి, చేతి వెనుక భాగాల్లో చెమట పట్టడం ఎలా ఉంటుందో మనకు తెలుసు.

ఈ శరీర భాగాల్లో చర్మం నిరోధాన్ని కొలిచేందుకు ప్రోబ్‌ల సహాయంతో శరీరంపైకి విద్యుత్ ప్రసారం చేస్తారు. విద్యుత్ బలం విలువ, ఆ భాగాల వద్ద ఏర్పడిన విద్యుత్ వోల్టేజ్‌లను తెలుసుకోవడంవల్ల చర్మం నిరోధకత్వం విలువ కనుగొంటారు.

ఈ డిటెక్టర్‌ను ఉపయోగించేటప్పుడు మనిషిని అనేక ప్రశ్నలు వేస్తారు. దైనందిన జీవితంలో జరిగే పనులకు సంబంధించిన ప్రశ్నలతో మిళితం చేసి నేరానికి సంబంధించిన ప్రశ్నలుకూడా వేస్తారు.

దైనందిన జీవితంలోని ప్రశ్నల జవాబు సమయంలోను, నేర సంబంధిత ప్రశ్నల జవాబు సమయంలోను ఆ మనిషి శరీర నిరోధకత్వంలోని మార్పులను మానసికతత్త్వ శాస్త్రవేత్త సహాయంతో విశ్లేషిస్తారు. మనిషిని నిజం చెప్పమని శారీరకంగా హింసించకుండా అతని నుండి నిజం రాబట్టేందుకు ఈ 'లై డిటెక్టర్' ఉపయోగపడుతుంది. విశ్లేషణల ఆధారంతో మనిషి అబద్ధం చెబుతున్నది లేనిది తెలుసుకోగల్గుతారు. విచిత్రం ఏమిటంటే మనిషి తన తెలివితో కొత్త కొత్త పద్ధతులు రూపొందిస్తుంటే మరొక మనిషి తన తెలివితో వాటికి అందకుండా తప్పించుకోగల్గుతున్నాడు. ★

**ఆవేశపు ఒత్తిడికి లోనయి మనిషి అబద్ధం చెబుతూ ఉంటే శరీర భాగాలు నిర్వహించే పనుల్లో తేడా వస్తుంది. ఇందులో గమనించవలసిన అంశం మనిషి చర్మం యొక్క నిరోధకత్వం.**

---

(9వ పేజీ తరువాయి)

"నాయినా! నువ్వు మాత్రం కదులుతున్నావా? ఏదో బాబాయి కూతురు పెళ్ళయితే తప్పక వచ్చావు... వచ్చినవాడివి ఇక్కడకు వచ్చావా... అదీ లేదు... మధ్యలో బోడి లాడ్జి!"

"నేను గుంటూరు స్టేషన్‌లో దిగేటప్పటికే ఏడు గంటలయింది... ఇక ఇక్కడకు వచ్చి మళ్ళీ పెళ్ళిపందిట్లోకి వెళ్ళటమంటే పదికి తక్కువగాదు... మా బాబాయి నసిగి ఊరుకున్నా... మా పిన్ని నిలబెట్టి దులిపేస్తుంది... ఇప్పటికే రెండుసార్లు అయింది దాన్ని తీసుకురానందుకు!"

వాడునవ్వుతూ ఎదురుగ్గా కూర్చున్నాడు.

నేను ఆనందంగా శాంతను గురించి వాడికి చెబుదామనుకున్నాను గాని- ఎదురుగ్గా వున్న వాడి భార్యముందు నా ప్రేమ కహానీని విప్పడానికి కించిత్ సంశయించాను. ఆమె అక్కడనుంచి వెళ్ళేటంతవరకూ గొంతు బిగపట్టుకున్నాను.

ఆమె అటు వెళ్ళగానే నోరు విప్పుదామనుకుంటున్నానో లేదో, వేణే, "నీకు తెలుసో తెలియదో... నీ మాజీ ప్రేమికురాలు శాంత ఇక్కడే ... మా యింటికి దగ్గరిలోనే వుంటున్నది...!" అన్నాడు.

నేను ఏదైతే చెప్పాలని వచ్చినప్పటి నుండి తహతహలాడుతున్నానో- అదే విషయాన్ని వాడు ఎత్తటంతో నాకు చాలా ఆనందమేసింది!

"నువ్వు పెందరాళే వచ్చి వున్నట్లయితే వాళ్ళింటికి తీసుకువెళ్ళి వుండేవాడిని... అంతేగాదు శాంత గూడా నిన్ను చూచి ఎంతగానో సంతోషించి వుండేది!"

"చివాట్లు పెట్టేటందుకు మరొకసారి నేను దొరికినందుకా!" అన్నాను వాడు ఎలా స్పందిస్తాడా అన్నట్లుగా వాడి మొఖంలోకే చూస్తూ.

"నువ్వు పొరబడుతున్నావు... శాంత తన చుట్టూ తిరిగిన అందరిలోకీ ఎక్కువగా ప్రేమించింది నిన్నే... అందుకే నిన్ను దూరం చేసుకున్నది!" అన్నాడు చాలా సీరియస్‌గా మొఖంపెట్టి. "ఈ మాటలు నావి కావు... ఆమె నోటి నుండే వెలువడ్డవి!"

ఇది నాకు చాలా కొత్త విషయం."అంత గాఢంగా ప్రేమించినప్పుడు నన్ను దూరం చేసుకోవాల్సిన అవసరం ఏమున్నది... నేను కాదంటే గదా- ట్రాష్... అంతా ట్రాష్... ఆమెకు సరితూగగల డబ్బు ఆనాడు నా దగ్గర లేకపోవటమే నన్ను తృణీకరించటానికి కారణం... ఇవి నా మాటలు కావు... ఆమెగారి స్వంత నోటినుండి వెలువడగా నా స్వంత చెవులతో నేను విన్న మాటలు!" కాస్త ఎగతాళిగా అన్నాను.

వేణు మాట్లాడలేదు కొద్ది క్షణాల వరకూ. తరువాత తలెత్తి నా మొఖంలోకి చూచాడు. "ఆమె నిన్ను కాదనటానికి అసలు కారణం చెబితే నువ్వు షాక్ తింటావ్!"

"అంత షాక్ తినే విషయమా అది?" అన్నాను కొంటెగా వాడిని మరింతగా రెచ్చగొడుతూ.

"అవును!" వాడు లేచి నిలబడ్డాడు. "నువ్వు మొదటిసారిగా ఆమెను పెళ్ళి చేసుకుందాం అని చెప్పేటప్పటికే ఆమె డబ్బున్న కుర్రవాళ్ళ మాయల్లో గొంతువరకూ కూరుకుపోయి కలుషిత వాతావరణంలో గిల గిల లాడిపోతూ... నీ మీద అంతర్గతంగా ఎంతో అభిమానమున్నా వాళ్ళ చేతుల్లో అప్పటికే పతనమయిన తను నీకు భార్య కాలేక నిన్ను తృణీకరించింది... నువ్వు మరీ మరీ వెంటబడి పట్టుబట్టటంతో కావాలని నీ అంతట నువ్వే ఆమెకు దూరమవ్వటానికిగానూ నిన్ను అవమాన పరిచింది!"

నేను వేణు మాటలకు ఉలిక్కిపడ్డ మాట వాస్తవం... అది నిజంగా నాకు షాకే!

- అంతే కాదు ఇన్నాళ్ళూ... నన్ను ఆమె నలుగురిలో అవమానపరిచిందని గుండెల్లో ఏ మూలనో గూడుకట్టుకొని వున్న కించిత్ కోపం గూడా ఆవిరైపోగా, ఆమె మీద మరింత ఆత్మీయత నన్ను ఉక్కిరి బిక్కిరి చేసింది! ★